సాక్షి
మెదక్
శనివారం । 1 । జూన్ । 2024



ఎండ ప్రచండ

నిర్మానుష్యంగా రాందాస్ చౌరస్తా

జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం నుంచే భానుడు భగభగ మండుతున్నాడు. దీంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. జిల్లాలో శుక్రవారం 43.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండవేడిమికి తట్టుకోలేక జనం ఇళ్లకే పరిమితం కాగా రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. – మెదక్‌జోన్

న్యూస్‌రీల్

‘బడిబాట’ను విజయవంతం చేయండి: కలెక్టర్

మెదక్ కలెక్టరేట్: అధికారులు సమన్వయంతో పనిచేసి బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన గుణాత్మక విద్య అందుతుందన్నారు. మౌలిక వసతులు కల్పించి, కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పంచాయతీ కార్యదర్శులు అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా చేపడుతున్న మౌలిక వసతులను పరిశీలించి తెలుసుకోవాలన్నారు. వానాకాలంలో నీటి నిల్వతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం కలెక్టరేట్‌లో ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ ఉన్నందున రాజకీయ ఉపన్యాసాలు లేవని చెప్పారు. ఆదివారం ఉదయం 8:55 గంటలకు అమరవీరులకు నివాళులర్పించి.. ఉదయం 9 గంటలకు జాతీయ పతాకవిష్కరణ ఉంటుందన్నారు.

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

నర్సాపూర్: జూన్ 4వ తేదీన చేపట్టే ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 307 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని చెప్పారు. ఓట్ల లెక్కింపు స్థానిక బీవీ రాజు ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేశామన్నారు. మెదక్ పార్లమెంట్‌లోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల పోస్టల్ బ్యాలెట్‌ను లెక్కించేందుకు ఒక భవనంలో ఏర్పాట్లు చేశామన్నారు. ఈవీఎంలలో ఉన్న ఓట్లు లెక్కించేందుకు కౌంటింగ్ సెంటర్‌లో 14 టేబుళ్ల ఏర్పాటు చేస్తామని, 22 రౌండ్లలో నర్సాపూర్ నియోజకవర్గంలోని ఓట్ల లెక్కింపు పూర్తవుతుందన్నారు. జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

ఆకట్టుకున్న కుస్తీ పోటీలు



కుస్తీ పడుతున్న మల్లయోధులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని మక్తలక్ష్మాపూర్‌లో మానిక్‌ప్రభు జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఆలయ ఆవరణలో కుస్తీ పోటీలు నిర్వహించగా.. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన మల్లయోధులు కుస్తీ పోటీల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

పనుల్లో నాణ్యత లోపించొద్దు: డీఈఓ



పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న డీఈఓ రాధాకిషన్

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం చిల్వర్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను శుక్రవారం డీఈఓ రాధాకిషన్ పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపించొద్దని అధికారులకు సూచించారు. జూన్ 5వ తేదీలోపు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. ఆయన వెంట ఎంఈఓలు బుచ్చానాయక్, నీలకంఠం, ఉపాధ్యాయులు జనార్దన్, శశొద్దీన్, సీఆర్పీ కిషన్, వీఓ మంగ ఉన్నారు.

వాక్ ఇన్ ఇంటర్వ్యూ

మెదక్ కలెక్టరేట్: జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 32 పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన తాత్కాలికంగా భర్తీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం జూన్ 3వ తేదీన పట్టణంలోని పిల్లికోటాల్‌లో గల మెడికల్ కళాశాలలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డాటా ఎంట్రీ ఆపరేటర్(11), ల్యాబ్ అటెండెంట్ (8), థియేటర్ అసిస్టెంట్ (4), ఆఫీస్ సబార్డినేటర్ (9) పోస్టులు భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. పూర్తి సమాచారం కోసం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆవిర్భావ ఉత్సవాలకు తరలిరండి

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మ



మెదక్ మున్సిపాలిటీ: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 1, 2, 3వ తేదీల్లో వేడుకలు ఉంటాయన్నారు. నేడు హైదరాబాద్‌లోని గన్‌పార్క్ అమరవీరుల స్థూపం నుంచి ట్యాంక్‌బండ్ వద్ద గల అమరజ్యోతి వరకు భారీ క్యాండిల్ ర్యాలీ ఉంటుందన్నారు. జిల్లాలోని ముఖ్యనాయకులు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని పిలుపునిచ్చారు. జూన్ 2న తెలంగాణ భవన్‌లో దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యేలు, జెడ్పీచైర్మన్లు, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. 3వ రోజు జిల్లా పార్టీ కార్యాలయంలో ముగింపు వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఈసందర్భంగా పార్టీ జెండాతో పాటు జాతీయ జెండాను ఆవిష్కరిస్తామని చెప్పారు. అనంతరం స్వీట్లు, పండ్ల పంపిణీ కార్యక్రమాలు ఉంటాయన్నారు. వేడుకల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

విత్తు.. విపత్తు

వానాకాలం సాగుకు సిద్ధమయ్యే రైతులకు ఏటా విత్తన కష్టాలు తప్పడం లేదు. పత్తికి సంబంధించి బ్రాండెడ్ విత్తనాల పేరిట బ్లాక్ మార్కెట్‌కు తెర తీస్తున్నారు. మరోవైపు అనుమతి లేనివి ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చి అమ్మకాలు జరపడంతో తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. మరోవైపు వ్యాపారులు కాలం చెల్లిన విత్తనాలను అంటగడుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని దుస్థితి ఇదీ.

- బ్లాక్ మార్కెట్‌కు పత్తి బ్రాండెడ్ రకాలు
- అనుమతిలేని బీటీ–3 విత్తనాల విక్రయాలు
- రైతుకు కాలం చెల్లిన సీడ్స్ అంటగడుతున్న వ్యాపారులు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో దుస్థితి ఇదీ..



గజ్వేల్‌లో పోలీసులు స్వాధీనం చేసుకున్న విత్తన ప్యాకెట్లు (ఫైల్)


గజ్వేల్: ఉమ్మడి జిల్లాలో ఏటా వానాకాలంలో 14 లక్షల ఎకరాల వరకు వివిధ రకాల పంటలు సాగులోకి వస్తుంటాయి. ఇందులో వరి ప్రథమస్థానం, పత్తి సాగు రెండో స్థానంలో నిలుస్తుంది. మిగతా స్థానాల్లో మొక్కజొన్న, కంది, సోయా ఇతర పంటలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో వరి అధికంగా సాగులోకి వస్తుంది. పత్తి అత్యధికంగా గజ్వేల్, సిద్దిపేట, జోగిపేట, వట్‌పల్లి, సంగారెడ్డి ప్రాంతాల్లో, జహీరాబాద్‌లో సోయాబీన్, మెదక్‌లో వరితో పాటు చెరకు ఇతర పంటలు ప్రత్యేకంగా సాగులోకి వస్తాయి.

అపోహ సృష్టించి..

వానాకాలం సీజన్‌లో బీటీ పత్తి విత్తనాల.. బ్లాక్ మార్కెట్ రైతులకు తలనొప్పిగా ఉండేది. శాస్త్రీయంగా అన్ని రకాల విత్తనాలు ఒకే రకమైన ఫలితాలనిస్తుండగా వ్యాపారులు మాత్రమే వ్యూహాత్మకంగా కొన్ని రకాలే మంచి దిగుబడులనిస్తాయని అపోహ సృష్టించి దండుకున్నారు. కొన్నాళ్ల మాత్రమే ఈ దందా ఆగింది. ప్రస్తుతం రైతులు బీటీ–2 పత్తి విత్తన ప్యాకెట్(475గ్రాముల పరిమాణం) ధర రూ.864గా నిర్ణయించారు. 30కిపైగా కంపెనీలు ఉత్పత్తి చేస్తున్న 200రకాల విత్తనాల ఇదే ధర్పై విక్రయించాలి. కానీ మార్కెట్‌లో నలుగైదు రకాలే అధిక అధిక దిగుబడులనిస్తాయనే అపోహను సృష్టించి రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు.

అనుమతిలేని విత్తనాలతో నష్టాలు..

అనుమతిలేని బీటీ–3 విడి విత్తనాలను దళారులు రైతులకు అంటగడుతున్నారు. ‘బీటీ–2’ కంటే తెగుళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడమే కాకుండా కలుపు ఉండదని నమ్మబలుకుతున్నారు. కలుపు నివారణకు కూలీలు సకాలంలో దొరక్క ఏటా భారీ ఎత్తున నష్టాలు సైతం వ్యాపారుల చేస్తున్న ప్రచారానికి ఆకర్షితులవుతున్నారు. బీటీ–2 విత్తన ప్యాకెట్ ధర ప్రస్తుతం రూ. 864 కానీ... బీటీ–3 అనుమతిలేని విత్తనాలను ఇందుకు రెట్టింపు, అంతకంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్, జాల్నో ప్రాంతాలతో పాటు గుజరాత్‌లోని వివిధ పట్టణాల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్ నుంచి ఈ అక్రమ సరుకు వచ్చేది. ప్రస్తుత సీజన్‌లోనూ అక్కడక్కడ ఈ పరిస్థితి కనిపిస్తుంది.



ఈ ఘటనలు నిదర్శనం

రైతులకు కాలం చెల్లిన విత్తనాలను అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారు వ్యాపారులు. మే 25న గజ్వేల్‌లోని లక్ష్మీబాలాజీ ట్రేడర్స్, పవనసుత ట్రేడర్స్, శ్రీ సాయి ఫర్టిలైజర్స్ దుకాణాల్లో స్థానిక ఏసీపీ పురుషోత్తంరెడ్డి చేపట్టిన తనిఖీల్లో కాలం చెల్లిన వరి, మెంతులు, గంగవాయిలి కూర, బీర్నీస్‌తోపాటు కాలం చెల్లిన పురుగు మందులను పట్టుకున్నారు. ఈ సందర్భంగా 610 కిలోల విత్తనాలను స్వాధీనం చేసుకొని వ్యవసాయ శాఖకు అప్పగించారు. 27న సైతం పద్మావతి రైతు సేవా కేంద్రంలో కాలం చెల్లిన విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు.

- విత్తన ప్రాసెసింగ్‌లోనూ ఈ ప్రాంతం కేంద్రంగా మారింది. ప్రత్యేకించి సిద్దిపేట జిల్లాలోని ములుగు, వర్గల్, మర్కూక్, గజ్వేల్ మండలాలు విత్తన కంపెనీలకు అడ్డాగా మారాయి. 2021 జూన్‌లో ములుగు మండలంలోని ఓ కంపెనీలో నాణ్యతా ప్రమాణాలను తనిఖీ చేయకుండానే మార్కెట్‌లోకి విడుదల చేయాలనుకున్న 2384 క్వింటాళ్ల వరి విత్తనాలను అధికారులు పట్టుకున్నారు. ఒక విత్తన కంపెనీలో రిజెక్ట్ అయిన స్టాక్ వివరాలను ప్రభుత్వానికి సమాచారం ఇవ్వకుండానే కంపెనీలో సాధారణ స్టాక్‌తోపాటే నిల్వ చేశారనే కారణంగా నోటీసులు ఇచ్చారు. 2022లోనూ జిల్లాలోని పలు చోట్ల వ్యవసాయ శాఖ విస్తృతంగా తనిఖీలు చేపట్టి పలు కంపెనీలకు నోటీసులు ఇచ్చింది.

రైతులు ఆందోళన చెందొద్దు



రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- జిల్లాలో విత్తనాల కొరత లేదు
- కలెక్టర్ రాహుల్‌రాజ్

టేక్మాల్(మెదక్): రైతులు ఆందోళన చెందొద్దని.. పక్కా ప్రణాళికతో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో జీలుగ విత్తనాల పంపిణీని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాతావరణశాఖ సూచనల ప్రకారం ఈసారి పది రోజుల ముందుగానే నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశిస్తున్నాయన్నారు. గతేడాది కంటే ముందుగానే వర్షాలు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. గడువు ముగిసిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అమ్మవద్దని వ్యాపారులకు సూచించారు. రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని, నకిలీ విత్తనాలు ఎక్కడైనా విక్రయిస్తున్నట్టు సమాచారం ఉంటే తెలియజేయాలని కోరారు. పచ్చిరొట్ట విత్తనాలు నాటేందుకు జూన్ రెండోవారం వరకు సమయం ఉందన్నారు. జిల్లాలో 6,400 క్వింటాళ్ల విత్తనాలు అవుతాయని ప్రణాళిక వేసుకున్నామని, ఇప్పటివరకు 4,787 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు అందించామన్నారు. మిగిలినవి వారం రోజుల్లో రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాంప్రసాద్, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ రియాజొద్దీన్, ఆర్‌ఐ సాయిశ్రీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

అమ్మ ఆదర్శ పాఠశాల పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాలోజిపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించి పనులను పరిశీలించారు. ఇప్పటివరకు మొత్తం 50 శాతం నిధులు విడుదల చేశామని తెలిపాను. అన్ని పాఠశాలల్లో పూర్తిస్థాయిలో పనులు జూన్ 5లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. త్వరలో ప్రారంభమయ్యే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోళ్లలో వేగం పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఓ రాధాకిషన్, సెక్టోరియల్ ఆఫీసర్ సుదర్శన్ మూర్తి, మండల విద్యాధికారులు నీలకంఠం, బుచ్చయ్య నాయక్, డీఈ పంచాయతీరాజ్ శ్రీనివాస్, ఏఈ గోపాల్, ఉపాధ్యాయులు రజిత తదితరులు పాల్గొన్నారు.



నీరులేక బోసిపోతున్న రంగనాయక సాగర్

రంగనాయక వెలవెల

రంగనాయక సాగర్ రిజర్వాయర్‌లో రోజు రోజుకూ నీటి మట్టం అడుగంటుతోంది. చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులో 3 టీఎంసీల సామర్థ్యంతో రంగనాయక సాగర్ రిజర్వాయర్ నిర్మించారు. మొన్నటి వరకు నీటితో కళకళలాడినా.. నేడు నీరులేక బోసిపోయింది. ప్రస్తుతం రంగనాయక సాగర్‌లో 0.07 టీఎంసీ నీరుంది. కాళేశ్వరం నుంచి పంపింగ్ నిలిచిపోవడంతో నీరు లేక ఇలా వెలవెలబోతుంది. –చిన్నకోడూరు(సిద్దిపేట)

నేటి నుంచి పోలీస్‌యాక్ట్: ఎస్పీ



మెదక్ మున్సిపాలిటీ: శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని శనివారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా పోలీస్‌యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ డాక్టర్ బాలస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ అధికారుల అనుమతి లేకుండా జిల్లాలో ప్రజలు ధర్నాలు, రాస్తారోకో, నిరసన, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. అలాగే ప్రజాధనానికి నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని హెచ్చరించారు. జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ విషయంలో సహకరించాలని ఎస్పీ కోరారు.

ఏడుపాయల ఇన్‌చార్జి ఈఓగా వినోద్‌రెడ్డి

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల ఎఫ్‌ఏసీ ఈఓగా వినోద్‌రెడ్డిని నియమిస్తూ దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ఈఓ మోహన్‌రెడ్డి శుక్రవారం పదవీ విరమణ చేయడంతో వినోద్‌రెడ్డికి పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించినట్లు పాలకవర్గ చైర్మన్ బాలగౌడ్ తెలిపారు.

అక్రమంగా మట్టి రవాణా



మట్టిని తరలిస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలోని నాగయ్య చెరువు నుంచి కొందరు అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని రైతులు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. చెరువు నుంచి కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్లు, ఇతర వాటికి చెరువు నుంచి పెద్దఎత్తున మట్టిని తరలిస్తున్నారని వాపోయారు. ఈవిషయమై తహసీల్దార్ శ్రీనివాసచారిని వివరణ కొరగా మట్టి తరలింపు విషయం తన దృష్టికి రాలేదని, విచారణ చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అన్నదాత పొలం బాట

జోరందుకున్న వ్యవసాయ పనులు

- దుక్కులు దున్నడంలో బిజీబిజీ
- తొలకరి కోసం ఎదురుచూపు
- పత్తి, వరి పంటలకు ప్రాధాన్యం



నారాయణఖేడ్: వేసవి దుక్కులు దున్నుతున్న రైతు

నారాయణఖేడ్: రైతులు వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్నారు. రోహిణి కార్తెలోనే చినుకులు కురవడంతో పొలంబాట పట్టారు. వేసవి దుక్కులు దున్నుతూ పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. జిల్లాలో పత్తి, కంది, మినుము, పెసర, సోయాబీన్, జొన్న, మొక్కజొన్న, వరి, తదితర పంటలు సాగవుతాయి. భూమి దున్ని వేడి చల్లారిన తర్వాత విత్తనాలు విత్తితే ఆశించిన స్థాయిలో పంట పెరుగుదల ఉంటుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

వేసవి దుక్కులతో ప్రయోజనాలు

వేసవి దుక్కుల వల్ల ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని, కర్బన శాతం, నీటిని నిలుపుకొనే శక్తి పెరుగుతుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. లోతుగా దున్నడం ద్వారా నేల పొరల్లో దాగిన పురుగులు వాటి గుడ్ల సముదాయాలు, నిద్రావస్థలో, కోశస్థ దశలో ఉన్న చీడపీడలు, శిలీంద్రాలు, కలుపు మొక్కల విత్తనాలు మట్టితోపాటు పైకి వచ్చి అధిక ఉష్ణోగ్రతల వేడి వల్ల నాశనమవుతాయి. వాటిని పక్షులు తినడం వల్ల అవి అంతరించిపోయే అవకాశం ఉంటుంది. శిలీంద్ర బీజాలు మట్టితోపాటే నేలపైకి వచ్చి వ్యాధి కలుగజేసే శక్తిని కోల్పోతాయి. తద్వారా వానాకాలం సాగు చేసే పంటలకు తెగుళ్ల, పురుగుల బెడద తక్కువగా ఉంటుంది. వాలుకు అడ్డంగా దుక్కులు దున్నడంతో వర్షపు నీటిని పొలంలో ఇంకేలా చేయడం తోపాటు పొలం కోతకు గురికాకుండా నివారించవచ్చు. అందుబాటులో ఉన్న పూడిక మట్టిని పొలంలో వేసుకోవడం వల్ల భూమి సారవంతంగా తయారవుతుంది. తొలకరి వానల తర్వాత పచ్చిరొట్ట ఎరువులు వేయడం వల్ల తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందే అవకాశం ఉంటుంది. పశువుల ఎరువుతోపాటు ఒండ్రు మట్టి పొలంనిండా చల్లి కలియ దున్నుకోవాలి.

కొయ్యలు కాల్చొద్దు..

వరి కొయ్యలను కాల్చకుండా కలియ దున్నడం ద్వారా నేలలో సేంద్రియ కర్బన పదార్థం పెరిగి పంట దిగుబడికి దోహద పడుతోంది. కర్బన పదార్థాలు పెరిగినప్పుడు సూక్ష్మ జీవులు, వానపాముల జీవన సంతతి వృద్ధి చేసుకొని నేల సారాన్ని పెంచుతాయని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. వ్యర్థాలు నేలలో కుళ్లిపోవడానికి సింగిల్ సూపర్ పాస్పేట్ వాడాలి. తద్వారా అవి మురిగి పంటకు భాస్వరం, ఇనుము, సల్ఫర్ వంటి మూలకాలు అందే అవకాశం ఉంటుంది. ఈ పద్ధతి ద్వారా నేలకు టన్ను ఎరువును అందించినంత ప్రయోజనం చేకూరడం తోపాటు నీటిలో కరగని స్వభావం ఉన్న మూలకాలు సైతం కరిగేలా అనుకూల పరిస్థితులు కల్పిస్తుంది.

క్లుప్తంగా

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

యూటీఎఫ్‌ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

కొండాపూర్‌(సంగారెడ్డి): ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టడంతోపాటు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే చెల్లించాలని టీఎస్‌ యూటీఎఫ్‌ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని యూటీఎఫ్‌ కార్యాలయంలో ఆఫీసర్‌ బేరర్స్‌ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. జూన్‌ 12తో విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని పాఠశాలలను అన్ని రకాల సౌకర్యాలతో తీర్చిదిద్దాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే ప్రకటించాలని డిమాండ్‌ చేశారు. ఉపాధ్యాయుల కొరత తీర్చడానికి ముందుగా తాత్కాలిక ఉపాధ్యాయులు (విద్యా వలంటీర్లను) నియమించి, తర్వాత డీఎస్సీ ద్వారా కొత్త రిక్రూట్మెంట్‌ జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్‌ రాష్ట్ర నాయకురాలు జ్ఞానమంజరి, యూటీఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు అశోక్‌, ప్రధాన కార్యదర్శి సాయిలు, ఉపాధ్యక్షుడు కాశీనాథ్‌, కోశాధికారి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

5.50 కిలోల గంజాయి పట్టివేత

ఇద్దరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

నారాయణఖేడ్‌: కర్ణాటకలోని బీదర్‌ ప్రాంతంలో విక్రయించేందుకు తీసుకెళ్తున్న ఎండు గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఖేడ్‌ డీఎస్పీ వెంకట్‌రెడ్డి కథనం మేరకు.. మెదక్‌ జిల్లా రేగోడు మండలం దోసపల్లికి చెందిన ఏసయ్య గంజాయి సేవించే అలవాటు ఉండటంతో వ్యవసాయ భూమిలో గంజాయి మొక్కలను పెంచుకున్నాడు. సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం పాలడుగుకు చెందిన విశాల్‌కు విషయం చెప్పి గంజాయిని అమ్మిస్తే వచ్చిన డబ్బుల్లో సగం వాటా ఇస్తానని ఒప్పించాడు. ఈ క్రమంలో మనూరు ఎస్‌ఐ అంబ్రాయ సిబ్బందితో కలిసి శుక్రవారం మధ్యాహ్నం మనూరు మండలం ధన్వార్‌ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. నిందితులు ఇద్దరూ బైక్‌పై గంజాయితో బీదర్‌కు వెళ్తూ వాహనాల తనిఖీలో పట్టుబడ్డారు. వెంటనే బైక్‌ను సీజ్‌ చేసి వారి వద్ద నుంచి 5.50 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని, ఇద్దరు నిందితులను అరెస్టు చేశామన్నారు. సమావేశంలో ఖేడ్‌ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, మనూరు ఎస్‌ఐ అంబ్రాయ, తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులో..

ముగ్గురికి జ్యుడీషియల్‌ రిమాండ్‌

సిద్దిపేటరూరల్‌: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో భాగంగా ముగ్గురు నిందితులకు ప్రిన్సిపల్‌ జ్యుడీషియల్‌ ఫస్ట్‌క్లాస్‌ మేజిస్ట్రేట్‌ పీ.చందన 14 రోజులు రిమాండ్‌ విధించినట్లు ఏసీపీ మధు శుక్రవారం తెలిపారు. రెండు రోజుల కిందట మండల పరిధిలోని సీతారాంపల్లి గ్రామంలో ఆలయ ప్రవేశం విషయంలో నమోదైన కేసు నమోదు చేసుకొని విచారణ అనంతరం కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జీ తీర్పు మేరకు రిమాండ్‌ తరలించారు.

సర్వం.. కబ్జాల పర్వం

సంగారెడ్డిలో ఖాళీ జాగా కనిపిస్తే ఖతం

- వక్ఫ్‌ భూముల్లో అక్రమ నిర్మాణాలు
- నోటీసులతో సరిపెడుతున్న అధికారులు
- రెండేళ్లుగా కనిపించని కూల్చివేతలు
- రూ.కోట్ల విలువ చేసే భూములు, ప్లాట్లు స్వాహా

జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో కబ్జాల పరంపర కొనసాగుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్‌, వక్ఫ్‌ బోర్డు, ఎలాంటి భూమి అనే తేడా లేకుండా యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు. ఖాళీ జాగా కనిపిస్తే చాలు అనుమతులు లేకుండానే విచ్చలవిడిగా రాత్రికి రాత్రే బోర్డు ఏర్పాటు చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. పట్టణంలోని ఐబీ వెనుకాల జిల్లా అధికారుల నివాసం పక్కనే వక్ఫ్‌ బోర్డుకు చెందిన భూమిలో కొంతమంది రియల్టర్లు అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఈ అక్రమార్కులకు స్థానిక నాయకుల అండదండలు ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

– సంగారెడ్డి



వక్ఫ్‌ బోర్డు భూమిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలు

సంగారెడ్డి పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ , ప్రైవేట్‌ భూముల్లో తప్పుడు పత్రాలు తయారు చేసి అమాయకులను బెదిరించడమే కాకుండా ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్నారు. ఐబీ వెనుక జిల్లా రెవెన్యూ అధికారి, ఆర్డీవోలు, జిల్లా అధికారులు నివాసం ఉంటున్న భవనాల సమీపంలో వక్ఫ్‌ బోర్డుకు చెందిన దాదాపు ఐదు ఎకరాల ఖాళీ స్థలం ఉంది. 374 సర్వే నంబరులో కొంత భూమిని కొన్నేళ్ల కిందట ప్రభుత్వం వక్ఫ్‌ బోర్డుకు కేటాయించినట్లు తెలిసింది. ఈ భూమిలో కొంతమంది వ్యక్తులు తప్పుడు పత్రాలు సృష్టించి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఇక్కడ బోర్లు వేయాలంటే వాల్టా చట్టం నిబంధనల ప్రకారం రెవెన్యూ, భూగర్భ జల శాఖల నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. రాజకీయ పలుకుబడి కలిగిన కొంతమంది ఎలాంటి అనుమతులు లేకుండానే రాత్రి వేళల్లో బోర్లు వేశారు. ఈ విషయం పై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు.

స్పందించని టాస్క్‌ఫోర్స్‌..

అనుమతులు లేకుండా, అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను అరికట్టేందుకు 2019లో రెవెన్యూ, పోలీస్‌, ఇరిగేషన్‌, మున్సిపల్‌ శాఖల అధికారులతో టాస్క్‌ఫోర్స్‌ టీమ్‌ను ప్రభుత్వం నియమించింది. కానీ అధికారులు పట్టణంలో చాలా అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా వాటిని కూల్చి వేయకపోవడం పై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం సంగారెడ్డిలోని వక్ఫ్‌ బోర్డుకు కేటాయించిన 374 సర్వే నంబరులో భూమిలో అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని 40 రోజుల కిందట మున్సిపల్‌ అధికారులు నోటీసులు జారీ చేశారు. మరికొన్ని ప్రైవేట్‌, ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇచ్చి 10 నెలలు గడిచినా ఇప్పటికీ కూల్చడం లేదు.

గతంలో ఉక్కుపాదం మోపినా..

జిల్లా కేంద్రం సంగారెడ్డిలో అక్రమ నిర్మాణాల చేపడుతున్న తరుణంలో రెండేళ్ల కిందట ఇక్కడి అదనపు కలెక్టర్‌ రాజార్శ ఎవరి మాటలు లెక్కచేయకుండా అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపారు. అప్పట్లో కొందరు అక్రమార్కులు భయంతో కబ్జాల జోలికి రాలేదు. ఆయన బదిలీపై వెళ్లిన తర్వాత తిరిగి కబ్జాదారులు రెచ్చిపోయారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో వక్ఫ్‌ భూమిలో నిర్మాణాలు చేపడుతున్న ఉదతంలో స్థానిక కౌన్సిలర్‌, వక్ఫ్‌ బోర్డ్‌ అధికారులకు లక్షల్లో చేతులు మారాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. అలాగే మున్సిపల్‌ అధికారులకు సైతం వాటా వెళ్లడంతోనే వారు అక్రమ నిర్మాణాలపై స్పందించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

కోడ్‌ ముగిశాక తొలగిస్తాం

“సంగారెడ్డిలోని ఐబీ వెనుకాల ఉన్న వక్ఫ్‌ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలు తొలగించాలని నోటీసులు మున్సిపల్‌ అధికారులు జారీ చేశారు. వాటిని కూల్చి వేసేందుకు టాస్కసర్వం సిద్ధం చేశాం. ఎలాంటి అక్రమ నిర్మాణాలు ఉపేక్షించేది లేదు. ప్రభుత్వ ఆదాయానికి నష్టం చేకూరేలా అక్రమ నిర్మాణాలు చేపట్టడం సరికాదు. మంత్రి, కలెక్టర్‌ అక్రమ నిర్మాణాలపై సీరియస్‌గా ఉన్నారు. వాటిని ఎప్పటికైనా తొలగిస్తాం. మున్సిపల్‌ అధికారుల తప్పిదం వల్ల అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి.”

– వసంత కుమారి, ఆర్డీఓ

ఫలితాలపై ఉత్కంఠ!

- 4న తేలనున్న భవితవ్యం
- లెక్కలేసుకుంటున్న నేతలు
- గెలుపై ఎవరి ధీమా వారిదే

నారాయణఖేడ్‌: హోరాహోరీగా సాగిన లోక్‌సభ పోరు ఫలితాల ప్రకటనకు ఓట్ల లెక్కింపు తేదీ దగ్గర పడుతుండడంతో పార్టీలు, నేతల్లో ఉత్కంఠ నెలకొంది. మే 13న పోలింగ్‌ ముగిశాక 22 రోజుల తర్వాత అంటే జూన్‌ 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. జహీరాబాద్‌ లోక్‌సభ పోరు రసవత్తరంగా సాగింది. ఫలితాలపై రోజూ చర్చలు, బేరీజులు వేసుకోవడాలు కొనసాగుతున్నాయి. ఓట్ల లెక్కింపు తేదీ సమీపిస్తుండంతో ఆ టెన్షన్‌ మరింత ఎక్కువయ్యింది. నేతలు, పార్టీలు, కార్యకర్తలు తమ నేత గెలుస్తాడంటే తమ నాయకుడు విజయం సాధిస్తాడంటూ లెక్కలు వేసుకొంటున్నారు. కొందరు ఒక అడుగు ముందుకేసి బెట్టింగులు సైతం కడుతున్నారు. దాదాపు నెల రోజులపాటు కాంగ్రెస్‌, బీజేపీ, బీఆర్‌ఎస్‌ నాయకులు సర్వశక్తులు ఒడ్డి ప్రచారం సాగించారు. నమోదైన ఓటింగ్‌ సరళిపై విజయం ఎవరిని వరిస్తుందోననే టెన్షన్‌ నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో క్రాస్‌ ఓటింగ్‌ జరిగిందనే ప్రచారం జోరందుకుంది. ఈ క్రాస్‌ ఓటింగ్‌ ఎవరికి లాభిస్తుంది, ఎవరిని ముంచుతుందన్న అంచనాలు వేస్తూ విజయం తమనే వరిస్తుందని ధీమా వ్యక్తం చేస్తూనే లోలోన బెంగ వ్యక్తమవుతుంది.

పెరిగిన ఓటింగ్‌ ఎవరికి లాభం..

ఈ సారి ఓటింగ్‌ పెరగడంతో ఎవరికి లాభిస్తుందో అన్న అంచనాలు వేస్తున్నారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 69.67శాతం పోలింగ్‌ మాత్రమే నమోదు అయ్యింది. కాగా ఈ సారి 74.63 శాతం నమోదు అయ్యింది. ఐదుశాతం పోలింగ్‌ పెరిగింది. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఒకటి, రెండు శాతం ఓట్లు సైతం అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్ణయించనున్నాయి. 2023 అసెంబ్లీ



ఎన్నికల్లో ఈ పార్లమెంట్‌ స్థాయి నియోజకవర్గం పరిధిలో 80.70 శాతం ఓటింగ్‌ నమోదు అయ్యింది. అదే అన్ని నియోజకవర్గాలు కలిపి పార్లమెంట్‌ పరిధి తీసుకుంటే ఈసారి 74.63 శాతం నమోదు అయ్యింది. ఈ విధంగా చూస్తే 6.07 శాతం ఓటింగ్‌ తగ్గుదల కన్పిస్తుంది. దీన్ని పరిశీలిస్తే అసెంబ్లీతో పోలిస్తే పార్లమెంట్‌కు వచ్చే సరికి ఓటింగ్‌ తగ్గుదల కన్పిస్తుంది.

ఫలితాల్లో మహిళల పాత్ర..

ఈ లోక్‌సభ పోలింగ్‌లో మహిళలు ఓటింగ్‌లో ఉత్సాహాన్ని కనబరిచారు. మొత్తం 16,41,410 మంది ఓటర్లు ఉండగా ఇందులో మహిళలు 8,01,862, పురుషులు 8,39,489 మంది ఉన్నారు. ఓటింగ్‌లో 6,16,936 మంది మహిళలు ఓటేయగా పురుషులు 6,08,097మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులతో పోలిస్తే మహిళలు 8,839 మంది అధికంగా ఓటేశారు. జయాపజయాలపై మహిళల పాత్ర కనిపించనుంది. ఈ పార్లమెంట్‌ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలైన నారాయణఖేడ్‌, జహీరాబాద్‌, అందోల్‌, కామారెడ్డి జిల్లాలోని జుక్కల్‌, బాన్సువాడ, ఎల్లారెడ్డి, కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఏ నియోజకవర్గంలో ఏ పార్టీకి మద్దతు, మెజార్టీ దక్కుతుందో అన్న లెక్కల్లో నేతలు మునిగిపోయారు. తమకు ఫలానా నియోజకవర్గంలో మెజార్టీ వస్తుందని, మరో నియోజకవర్గంలో తగ్గుతుంది అంటూ నాయకులు బేరీజులు వేస్తున్నారు. ఓటరు ఇచ్చే తీర్పుతో నాయకుల ఉత్కంఠకు 4వ తేదీతో తెరపడనుంది.

మత్తులో బీర్‌ బాటిళ్లతో దాడులు



నిందితులను చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ మధు

- ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు, కారు ధ్వంసం
- నలుగురిపై హత్యాయత్నం కేసు

దుబ్బాక: మద్యం మత్తులో నడిరోడ్డుపై కారును అడ్డగించి ఇద్దరు యువకులపై బీరు బాటిళ్లతో విచక్షణ రహితంగా దాడి చేశారు. ఈ ఘటనలో నలుగురు యువకులను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సిద్దిపేట ఏసీపీ జీ.మధు తెలిపారు. దుబ్బాక సీఐ శ్రీనివాస్‌, ఎస్‌ఐ గంగరాజు తో కలిసి విలేకర్ల సమావేశంలో ఏసీపీ వివరాలు వెల్లడించారు. దుబ్బాక పట్టణంలోని గంగమ్మ గుడి వద్ద మహ్మద్‌ రసద్‌, విష్ణు అనే యువకులు కారులో ఉన్నారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం దుబ్బాక పట్టణానికి చెందిన దేవుని రమణ, పర్స భాస్కర్‌, రాచమల్లు వినోద్‌, ఆలేటి శరత్‌ నలుగురు యువకులు లచ్చపేటలో అతిగా మద్యం సేవించి దుబ్బాకకు కారులో వస్తున్నారు. గంగమ్మ గుడి వద్ద కారులో ఉన్న రసద్‌, విష్ణులపై బీరు బాటిళ్లతో విచక్షణ రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అంతే కాకుండా కారును సైతం ధ్వంసం చేశారు. తీవ్రంగా గాయపడ్డ రసద్‌, విష్ణు దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుడు రసద్‌ భార్య నస్రీం ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురు యువకులపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఏసీపీ మధు తెలిపారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు : డిప్యూటీ ఆర్‌ఎంవో



ప్రశంసాపత్రాలతో ఆర్టీసీ సిబ్బంది, అధికారులు

ఆర్టీసీ సిబ్బందికి సన్మానం

గజ్వేల్‌రూరల్‌: విధుల్లో ఉత్తమ సేవలందించే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని డిప్యూటీ ఆర్‌ఎంవో ద్వైవాదీనం పేర్కొన్నారు. జీపీపీ (గజ్వేల్‌-ప్రజ్ఞాపూర్‌) ఆర్టీసీ డిపోలో ఉత్తమ విధులు నిర్వహించిన డ్రైవర్లు ఎస్‌కే మీర, బాల్‌రెడ్డి, సలీమ్‌, ఆంజనేయులు, బాలయ్య, కండక్టర్లు రాణి, రజిత, శ్రీనివాస్‌, నాగేందర్‌, మెకానిక్‌లు అమీనుద్దీన్‌, వెంకటేశం, రహీమ్‌, రియాజుద్దీన్‌, శివకుమార్‌, జగన్‌లకు శుక్రవారం ప్రశంసాపత్రాలను అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులను మెరుగైన సేవలందించడంతో పాటు ఆర్టీసీని లాభాల బాటలో పయనింపజేసేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జీపీపీ ఆర్టీసీ డిపో మేనేజర్‌ సురేఖ, ఉద్యోగులు, సిబ్బంది బాబు నాయక్‌, జమీల్‌, జయకుమార్‌, కేఎంరెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రజ్ఞాపూర్‌లోని ఆర్టీసీ బస్టాండ్‌లో నిలిచిపోయిన పనులను పరిశీలించారు.

మహిళ మృతదేహం లభ్యం

చిన్నశంకరంపేట(మెదక్‌): గుర్తు తెలియని మహిళ నీటి కుంటలో శవమై తేలిన ఘటన నార్సింగి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. శుక్రవారం ఉదయం నార్సింగిలోని కుమ్మరికుంటలో మహిళ శవం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కుంట వద్దకు వెళ్లి పరిశీలించారు. బతుకుదెరువు కోసం వచ్చిన మహిళ ఆత్మహత్యకు పాల్పడిందా లేదా ఎక్కడైనా హత్య ఇక్కడ పడేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. మహిళ వయస్సు సుమారు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని తెలిపారు. మల్టీకలర్‌ కుర్తా, ఎర్ర రంగు పైజామా ధరించడంతోపాటు కుంట కట్టపైన ఎర్ర రంగు చెప్పులు లభించినట్లు నార్సింగి ఎస్‌ఐ అహ్మద్‌ మోహినోద్దీన్‌ తెలిపారు. మృతురాలి ఆచూకీ తెలిసిన వారు సెల్‌ నంబర్‌ 87126 57938 సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.

ఎంసీహెచ్‌లో శిశువు మృతి



ఆస్పత్రిలో శిశువు మృతదేహం

వైద్యుల నిర్లక్ష్యమంటూ కుటుంబీకుల ఆందోళన

మెదక్‌జోన్‌: మూడురోజుల పసికందు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబీకులు, బంధువులు ఆందోళన చేసిన ఘటన శుక్రవారం ఎంసీహెచ్‌లో చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళ్తే.. హవేళిఘనపూర్‌ మండలం కూచన్‌పల్లి గ్రామానికి చెందిన నామ భవానీ డెలివరీ నిమిత్తం గత నెల 28వ తేదీన స్థానిక ఎంసీహెచ్‌లో చేరింది. మరుసటి రోజు మగ బిడ్డకు జన్మనిచ్చింది. 30న శిశువుకు జ్వరం వచ్చిందని వైద్యులు చికిత్సలు చేస్తున్న క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందింది. శిశువు మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బాధిత కుటుంబీకులు సుమారు రెండు గంటల పాటు ఆందోళన చేశారు. వైద్యులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ పీ.చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు.

భూ వివాదంతో యువరైతు ఆత్మహత్య

న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్‌ ఎదుట మృతుడి కుటుంబీకుల ఆందోళన

నిజాంపేట(మెదక్‌): భూ వివాదంలో ఓ యువరైతు ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన శుక్రవారం మండలంలోని రజాక్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం మేరకు... గ్రామానికి చెందిన చింతాకుల రాములుకు ఇద్దరు కుమారులుండగా, 13 ఎకరాల మేర వ్యవసాయ భూమి ఉంది. ఐదేళ్ల కిందట రాములు మృతి చెందగా, సోదరులు గుట్టయ్య, స్వామి సమానంగా భూమి పంచుకోవాల్సి ఉంది. సోదరుడు స్వామికి భూమి పంచి ఇవ్వకుండా గుట్టయ్య కొంతకాలంగా వేధింపులకు పాల్పడుతున్నాడు. దీంతో స్వామి పెద్దలను, పోలీసులను ఆశ్రయించాడు. అన్నాదమ్ములిద్దరూ భూమిని సమాన పాళ్లలో పంచుకోవాలని గ్రామ పెద్దల సమక్ష్యంలో ఒప్పందం జరిగింది. స్వామి రిజిస్ట్రేషన్‌కోసం స్లాట్‌ బుక్‌ చేసుకున్నాడు. ఏమైందో తెలియదుకాని శుక్రవారం ఉదయం స్వామి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తమ్ముడి మృతదేహాన్ని చూడటానికి వచ్చిన గుట్టయ్యపై గ్రామస్తులుదాడి చేశారు. సదరు భూమిని మృతుడి భార్య పేరిట రిజిస్ట్రేషన్‌ చేయించి ఇచ్చే వరకు మృతదేహాన్ని తీయని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు డిమాండ్‌ చేశారు. రామాయంపేట సీఐ వెంకటేశ్‌ నచ్చజెప్పినా వినలేదు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు నిజాంపేట పోలీస్‌స్టేషన్‌ వద్దకు చేరుకొని మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు. భూమి రిజిస్ట్రేషన్‌ చేసి ఇస్తామనడంతో ఆందోళన విరమించారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

జహీరాబాద్‌ టౌన్‌: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన జహీరాబాద్‌ పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. వికారాబాద్‌ రైల్వే పోలీసు అధికారి దీపక్‌ కథనం మేరకు.. సుమారు 60 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో ఒకటవ నంబర్‌ ప్లాట్‌ ఫామ్‌ వద్ద ప్రమాదవశాత్తు రైలు పట్టాలపై పడ్డాడు. అప్పుడే వచ్చిన రైలు ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృత్యుడి శరీరంపై ముదురు ఎరుపు రంగు షర్టు ఉందన్నారు. మృతదేహాన్ని వికారాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రిలో మూడు రోజుల పాటు భద్రపరుస్తామన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 58587 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.



రైలు పట్టాలపై మృతదేహం

సాగు భారం

రోజు రోజుకూ పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు

- ఎరువుల ధరలు పైపైకి..
- ఆకాశాన్నంటుతున్న ట్రాక్టర్ల కిరాయిలు
- అయోమయంలో రైతులు





పత్తి పంటలో ట్రాక్టర్‌తో మందు పిచికారీ చేస్తున్న రైతు

మునిపల్లి(అందోల్‌): రైతులకు సాగు భారంగా మారుతోంది. డీజిల్‌ ధరలు పైపైకి పోతుండడంతో ట్రాకర్లు, యంత్రాల కిరాయి అమాంతం పెంచేస్తున్నారు. దీంతో పెట్టుబడి పెరిగి రైతులు వ్యవసాయం చేయలేని పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న పెట్టుబడి సాయం కూలీల ఖర్చులకే సరిపోవడం లేదు. పెట్టుబడి సాయాన్ని కూడా పెంచాలని రైతులు కోరుతున్నారు. జిల్లాలో అత్యధికంగా రైతులు వర్షాలపై ఆధారపడి పత్తిని సాగు చేస్తారు. నియంత్రిత సాగు విధానంతో భాగంగా పెసర, మినుము, వరి సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో పెరుగుతున్న యంత్రాల ఖర్చు, చమురు ధరల భారంతో ఈ మాత్రం సాగు కూడా చేయలేని పరిస్థితి ఏర్పడింది. పత్తి పంట వర్షాలు సక్రమంగా పడకపోయినా తట్టుకొని నిలబడుతుంది. మిగితా పంటలు వర్షాలు సక్రమంగా పడకపోతే నష్టం వస్తుంది. దీంతో రైతులు ఎక్కువ శాతం మంది రైతులు పత్తి పంట సాగుపైనే దృష్టి సారిస్తున్నారు.

వివిధ రకాల ఎరువుల ధరలు

(50 కిలలో బస్తాకు రూ.లలో)

ఎరువులు	పాత ధర	కొత్త ధర
డీఏపీ	1,250	1.500
20-20-0-13	950	1.200
యూరియా	266	266

పెరిగిన కూలీల ఖర్చులు..

పత్తి విత్తనాలు నాటడానికి కూలీలకు 2023లో రోజుకు రూ.400 నుంచి రూ.500 చొప్పున కూలి తీసుకునేవారు. ప్రస్తుతం ఎకరాకు రూ.500 నుంచి రూ.550 చొప్పున తీసుకునేందుకు ముందస్తుగా మాట్లాడుకుంటున్నట్లు రైతులు చెబుతున్నారు. ట్రాక్టర్‌తో పత్తి సాలు ఎకరాకు 2023లో రూ.1,000 తీసుకోగా ప్రస్తుతం రూ.1,050 చొప్పున తీసుకునేందుకు ట్రాక్టర్‌ నిర్వాహకులు ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. పత్తి మందు పిచికారీ చేయడానికి రోజుకు కూలి రూ. 600 నుంచి 700 కూలి తీసుకుంటున్నట్లు రైతులు చెబుతున్నారు.

పెట్టుబడి సాయం రూ.30 వేలు ఇవ్వాలి



రోజు రోజుకూ పెరుగుతున్న వ్యవసాయ సాగు ఖర్చులకనుగుణంగా ప్రభుత్వం పెట్టుబడి సాయం ప్రతీ సంవత్సరం ఎకరాకు రూ.30 వేలు మంజూరు చేసి ఆదుకోవాలి. ఎరువుల ధరలు తగ్గించి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి దోహద పడాలి. ప్రకృతి అనుకూలిస్తేనే పంట చేతికొచ్చే అవకాశం ఉంది. ప్రకృతి అనుకూలించకపోతే అప్పుల పాలే.

– నారాయణ, హస్నాబాద్‌

మద్దతు ధర చెల్లించాలి



వివిధ రకాల పంటలకు ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలి. గిట్టుబాటు ధర వస్తేనే పెట్టుబడులు చేతి కందే అవకాశం ఉంటుంది. ప్రతీ ఏడాది పెరుగుతున్న ఖర్చులతో పెట్టుబడి భారంగా మారుతోంది. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వమే ప్రోత్సాహం అందించాలి.

– జాఫర్‌, తాటిపల్లి

పంట దిగుబడిపై అవగాహన



నాణ్యమైన విత్తనాలు నాటి పంట దిగుబడి సాధించేందుకు గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ అనుమతి ఉన్న షాపులోనే విత్తనాలను కొనుగోలు చేయాలని రైతులకు చెబుతున్నాం. పెట్టుబడి సాయం పెంచడం ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంది.

–నర్సింగ్‌రావు ,జిల్లా వ్యవసాయాధికారి